క్లుప్తంగా

రాయవరంలో నాకా బందీ

రాయవరం: రాయవరం శివారు ప్రాంతంలో ఎస్సై డి.సురేష్‌బాబు సిబ్బందితో కలసి బుధవారం సాయంత్రం నాకా బందీ నిర్వహించారు. నాకా బందీలో డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్స్ లేకుండా వాహనాలను నడుపుతుతున్న వాహన డ్రైవర్ల నుంచి అపరాధ రుసుం వసూలు చేశారు. 20 వాహనాలను తనిఖీలు చేయడం ద్వారా రూ.5,385 అపరాధ రుసుం వసూలు చేసినట్లు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు. మోటార్ వాహన చట్టం ప్రకారం అనుమతి పత్రాలు లేకుండా వాహనాలు నడిపిన వారిని, హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్న వారిపై నిఘా ఉంటుందని ఎస్సై తెలిపారు. వాహన చోదకులు విధిగా అన్ని అనుమతి పత్రాలను వాహనం నడిపేటప్పుడు వారి వెంట ఉంచుకోవాలన్నారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇస్తే మైనర్లతో పాటు తల్లిదండ్రులు కూడా చట్ట ప్రకారం శిక్షార్హులేనన్నారు. మద్యం తాగి వాహనం నడిపిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన తెలిపారు.

హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం

కపిలేశ్వరపురం (మండపేట): కూటమి ప్రభుత్వం పాలనాకాలం సుమారు ఏడాది కావస్తున్నా ఎన్నికల హామీలను విస్మరించి పాలన సాగిస్తోందని అఖిల భారత కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ చైర్మన్ కామన ప్రభాకర రావు ఆరోపించారు. మండపేటలోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు ఇచ్చిన హామీల్లో కనీసం 10 శాతం హామీలను కూడా నెరవేర్చలేదన్నారు. ఏడాదిలో మూడు గ్యాస్ సిలిండర్లను ఇవ్వాల్సి ఉండగా కేవలం ఒక్కటి మాత్రమే ఇచ్చారన్నారు. అది సైతం అందని వారెందరో ఉన్నారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం గాలికి వదిలేశారన్నారు. ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఆర్థికసాయం అందిస్తానన్న హామీ బుట్టదాఖలైందన్నారు. ఏడాది కాలం చదువులు పూర్తయినా తల్లికి వందనం అందలేదని, ఖరీఫ్, రబీ పంటల కాలం పూర్తయినా రైతుకు అన్నదాతా సుఖీభవ పెట్టుబడి సాయం అందలేదన్నారు. ప్రభుత్వంలోకి రాగానే వెంటనే అమలు చేసింది ఏదైనా ఉందంటే అది మద్యం దుకాణాలు మాత్రమే అని ఎద్దేవా చేశారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ ప్రజానుకూలంగా పాలన సాగించడంలో నరేంద్ర మోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌లు విఫలమయ్యారన్నారు. కూటమికి అత్యధిక మెజారిటీ కట్టబెట్టిన ప్రజలు 11 నెలల పాలనను చూసైనా సరైన ఆలోచనతో మేల్కొనాలని కామన ప్రభాకరరావు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా అన్నమయ్య జయంతి ఉత్సవాలు


అమలాపురం టౌన్: సంస్కార భారతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో తాళ్లపాక అన్నమయ్య జయంతి ఉత్సవాలు స్థానిక సుభద్ర నర్సింగ్ హోమ్ వద్ద బుధవారం జరిగాయి. ఈ సందర్భంగా డాక్టర్ అయ్యగారి రాధిక చేసిన వీణా గానం ఆహూతులను అలరించింది. సంస్కార భారతి ప్రతినిధి శ్రీగిరి పద్మావతి అధ్యక్షతన జరిగిన ఈ జయంతి ఉత్సవంలో తొలుత అన్నమయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నమస్సుమాంజలి ఘటించారు. అన్నమయ్య కీర్తనలను నాగ కమల లయబద్ధంగా ఆలపించి రంజింపచేశారు. అలాగే సంగీతం మాస్టారు మట్టపర్తి చంద్రశేఖర్ కూడా అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. చిన్నారి లహరి ఆలపించిన కీర్తనలు అందిరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం సంగీత కళాకారులను సంస్కార భారతి ప్రతినిధులు సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

పౌష్టికాహారమే పరమౌషధం

- వేసవిలో చిన్నారులకు పొంచి ఉన్న ముప్పు
- ముందస్తు జాగ్రత్తలే శ్రీరామరక్ష



గవద బిళ్లల నమూనా ఫొటో



చికెన్‌పాక్స్ నమూనా ఫొటో

రామచంద్రపురం రూరల్: వేసవిలో చికెన్‌పాక్స్ (ఆటలమ్మ), గవద బిళ్లలు వంటి సమస్యలు పిల్లల్లో అధికంగా కనిపిస్తాయి. ప్రస్తుతం పలు గ్రామాల్లో ఈ సమస్యలతో చిన్నపిల్లలు బాధపడుతున్నారు. చాలా మంది తమ పిల్లల్ని ఆస్పత్రులకు తీసుకువస్తుంటే.. కొంతమంది పూర్వం పద్ధతుల్లో నాటు వైద్యం చేయిస్తున్నారు. అన్ని వయసుల వారికి ఈ వ్యాధుల సోకే అవకాశం ఉన్నా చిన్నారులకు త్వరగా సోకుతుందని వైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధుల బారిన పడిన వారికి జలుబు, జ్వరం, శరీరంపై పొక్కులు, దవడలకు ఇరువైపులా బిళ్లలు, నొప్పి వంటి సమస్యలు తీవ్రంగా బాధిస్తాయి. ముందు జాగ్రత్తతోనే ఈ ప్రమాదకర అంటువ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, 15 ఏళ్లలోపు బాలబాలికలపై మరింత శ్రద్ధ వహించాలంటున్నారు.

జాగ్రత్త వహించాలి

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో ఐదేళ్లలోపు చిన్నారులు సుమారు 25 వేల మందికి పైగా ఉన్నారు. ఈ వేసవిలో వారిపట్ల మరింత శ్రద్ధ చూపాలని వైద్యులు సూచిస్తున్నారు. సాధారణంగా వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో ఈ సమస్యలు ఎక్కువగా వస్తాయని అంటున్నారు. ఈ వ్యాధులు ప్రాణాంతకం కాకపోయినా వ్యాధి సోకిన వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతారు. ఆకలి లేకపోవడంతో ఆహారం సరిగ్గా తీసుకోలేక బాగా నీరసించిపోతారు. చర్మంపై నీటి పొక్కులు, దురదలు వంటి లక్షణాలు వారం నుంచి పదిహేను రోజులకు పైగా బాధిస్తాయి. తొలుత జలుబుతో ప్రారంభమయ్యే ఈ వ్యాధులు క్రమంగా వాటి ప్రభావం చూపుతాయి. శరీరంపై నీటి పొక్కులు, జ్వరం వంటి లక్షణాలు కనిపించగానే ఆటలమ్మగా గుర్తించి తక్షణం వైద్యులను సంప్రదించాలి. నాటు వైద్యం వైపు వెళ్లరాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వ్యాధి తీవ్రతను బట్టి యాంటీ వైరల్, యాంటీ బయాటిక్ మందులు వాడాల్సి ఉంటుంది. తద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించడమే కాకుండా, వేగంగా నయం కావడానికి అవకాశం ఉంటుంది.

ఆటలమ్మ.. జాగ్రత్తలు

సాధారణంగా ఈ వ్యాధి వారం నుంచి పది రోజుల వరకు ఉంటుంది. ఆటలమ్మ అంటు వ్యాధి కావడం వల్ల వ్యాధి సోకినవారిని మిగిలిన వారికి దూరంగా ఉంచాలి. వ్యాధి సోకిన పిల్లలను ఆటలకు పంపకూడదు. ప్రతి రోజూ స్నానం చేయవచ్చు. జ్వరం ఉంటే వేడి నీటితో శరీరాన్ని శుభ్రం చేయాలి. దురద రాకుండా పరిశుభ్రత పాటించాలి. చిన్నారులకు చేతి గోళ్లు తీసివేయడం మంచిది. మంచి పౌష్టికాహారం అందించాలి. ఆటలమ్మ వచ్చిన వారు కోరినవన్నీ ఇవ్వాలన్న అపోహతో అన్ని రకాల తినుబండారాలను ఇవ్వడం మంచిది కాదు. తేలికగా జీర్ణమయ్యే మంచి పౌష్టికాహారాన్ని అందించాలి.

గవదబిళ్లలు.. జాగ్రత్తలు

గవదబిళ్లల వ్యాధిలో తీవ్రంగా గొంతునొప్పి ఉంటుంది. నోటిని శుభ్రంగా ఉంచుకోవాలి. తరచూ ద్రవ పదార్థాలను ఆహారంగా తీసుకోవాలి. నీరసం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు ఉంటాయి. శరీరంలో ద్రవాల శాతం తగ్గుతుంది. కాబట్టి ఓఆర్ఎస్ వంటివి తీసుకోవడం మంచిది.

నాటువైద్యం ప్రమాదకరం

చికెన్‌పాక్స్, గవద బిళ్లలు వచ్చిన వారి విషయంలో ప్రజలు అపోహలు, మూఢనమ్మకాలు పెట్టుకోకుండా వైద్యులను సంప్రదించాలి. చాలామంది మూఢనమ్మకాలతో వైద్య సహాయం తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. వైద్యుల సలహా తీసుకుని అవసరమైన మందులకు క్రమం తప్పకుండా వాడాలి. వ్యాధి ఎక్కువగా ఉంటే మెదడు, ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. గర్భిణులపై ఈ సమస్య తీవ్ర ప్రభావం చూపుతుంది. నాటువైద్యాన్ని ఆశ్రయిస్తే ప్రమాదానికి దారితీస్తుంది.

వైద్యులను సంప్రదించాలి



ఆటలమ్మ, గవద బిళ్లలు వంటి వ్యాధులను నిర్లక్ష్య చేయడం మంచిది కాదు. ప్రస్తుతం చిన్న పిల్లలు ఎక్కువగా ఈ సమస్యలతో బాధపడుతున్నారు. ఈ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే అందుబాటులోని వైద్యులను సంప్రదించాలి. వారి సూచనల మేరకు మందులు వాడాలి.

– ఎన్.ప్రశాంతి, డివిజనల్ మెడికల్ ఆఫీసర్, రామచంద్రపురం

హోమియోలో నివారణ మందులు



వేసవిలో వచ్చే వ్యాధుల బారిన పడకుండా హోమియో వైద్య విధానంలో మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. చిన్న పిల్లలతో పాటు పెద్దవాళ్లు కూడా ముందు జాగ్రత్తగా ఈ మందులు ఉపయోగించడం ద్వారా వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు.

– వి. ఫణి వెంకటలక్ష్మి, వైద్యాధికారి, వెంటూరు హోమియో ఆసుపత్రి

అందుబాటులో ఆధార్ కేంద్రం

మరో మూడు రోజులే అవకాశం



ద్రాక్షారామ పోస్ట్ ఆఫీస్‌లో చిన్నారుల ఆధార్ అప్‌డేట్ చేస్తున్న శివకుమార్

రామచంద్రపురం రూరల్: మండలంలో సుమారు 50 కి పైగా గ్రామాలకు కూడలిగా ఉన్న ద్రాక్షారామలోని పోస్టాఫీసులో ఆధార్ కేంద్రం అందుబాటులో ఉన్నట్లు ద్రాక్షారామ పోస్ట్ ఆఫీస్ పోస్ట్ మాస్టర్ సత్తి వీర వెంకట సత్యనారాయణ బుధవారం విలేకరులకు తెలిపారు. ఏప్రియల్ 15న ప్రారంభించిన ఆధార్ కేంద్రం ఈ నెల 17 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఫోన్ నంబరు లింక్ చేయడం, వేలి ముద్రలు, ఫొటో నవీకరణ, ఐరిస్ నవీకరణ, జిల్లా మార్పు, పుట్టిన తేదీ మార్పు, పేరులో మార్పులు, చిరునామా మార్పుల సేవలు నిర్ణీత నామమాత్రపు రుసుముతో చేయడం జరుగుతుందన్నారు.

గడువు పెంచే అవకాశం ఉంది

ఇటీవల చాలా మంది రేషన్ కార్డుదారులు ఈ–కేవైసీ చేయించుకోకపోతే ప్రభుత్వం అందిస్తున్న రేషన్ నిలిచిపోతుందని ఆందోళన చెందుతున్నారు. దీంతో పాటు శిశు ఆధార్, మార్పులు, చేర్పుల కోసం ప్రయోజనం కల్పించేలా పోస్టర్ సూపరింటెండెంట్ శేషారావు సూచనల మేరకు ద్రాక్షారామ పోస్ట్ ఆఫీస్‌లో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. ఇతర సమాచారం కోసం ఆధార్ వ్యవహారం చూస్తున్న ఎంటీవీ శివ కుమార్‌ను ఆఫీసు పనివేళల్లో సంప్రదించాలి. ప్రజలు వినియోగించుకుంటే గడువు పెంచే అవకాశం ఉంది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



వెదురుపాక జెడ్పీ ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

రాయవరం: మండలంలోని వెదురుపాక జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం పాఠశాలలో నిర్వహించారు. 2000–05 సంవత్సరాల్లో పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాలలో కలుసుకున్నారు. పూర్వ విద్యార్థులు పడాల శివమణికంఠరెడ్డి, కొవ్వూరి దుర్గాకృష్ణారెడ్డి, గుడిమెట్ల విజయభాస్కరరెడ్డి, నల్లమిల్లి కృష్ణవేణి, కర్రి అరుణలు పూర్వ విద్యార్థుల కలయికకు కృషి చేశారు. 19 ఏళ్ల అనంతరం కలుసుకున్న పూర్వ విద్యార్థులు నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు రూ.10 వేలను పూర్వ విద్యార్థులు ప్రస్తుత పాఠశాల హెచ్ఎం పోలిశెట్టి రాంబాబుకు అందజేశారు. పూర్వ విద్యార్థుల నుంచి శ్రీహరికోట ఇస్రోలో ఇంజినీర్‌గా పనిచేస్తున్న యడ్ల దుర్గాప్రసాద్, విశాఖపట్నం గాయత్రి ఉమెన్స్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ దంతులూరి శివరంజని, సొసైటీ సీఈవో సత్తి రాజారాంరెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం సామాజిక బాధ్యత



చిన్నారులకు సూచనలు చేస్తున్న గ్రంథాలయాధికారి శివకుమారి

కపిలేశ్వరపురం: పుస్తకాన్ని చదవడం విద్యార్థులు ఒక సామాజిక బాధ్యతగా గుర్తించాలని కపిలేశ్వరపురం సర్పంచ్ శాకా శ్రీనివాస్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయాధికారి దానేటి శివ కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన సందర్శించారు. మానవ సమాజం నడుస్తున్న చరిత్ర అని చారిత్రక పుస్తకాలు చదవడం ద్వారా భూత, వర్తమాన, భవిష్యత్ కాలాల నడవడికను అర్థం చేసుకొనే సామర్థ్యాన్ని అలవర్చుకోవచ్చన్నారు. శిబిరంలో పుస్తక పఠనం, కథలు చెప్పడం, జనరల్ నాలెడ్జ్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

ప్రజా సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

కాజులూరు: కమీషన్లు లభించే రాజధాని నిర్మాణంపై తప్ప ప్రజా సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, రామచంద్రపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. బుధవారం శలపాకలో ఓ కార్యక్రమంలో సూర్యప్రకాశ్ పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి కార్యకర్తలను కలుసుకున్నారు. పలువురు రైతులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లు జరగకపోవటంతో ధాన్యం కళ్లాల్లోనే ఉండిపోయిందని వర్షాల కారణంగా పంట తడిసిపోతుండటంతో తీవ్ర ఆందోళనలకు గురవుతున్నామన్నారు. దీనిపై సూర్యప్రకాశ్ మాట్లాడుతూ రైస్‌మిల్లర్ల సంక్షేమం తప్ప రైతుల సమస్యలు పాలకులకు పట్టడం లేదన్నారు. ధాన్యం కొనుగోలుపై వైఎస్సార్ సీపీ రైతుల పక్షాన పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ దడాల రమేష్, పార్టీ ఎస్సీ సెల్ కన్వీనర్ పోలినాటి సూర్యచంద్రం, పార్టీ నాయకులు పొట్లకాయల నాగేశ్వరరావు, మండల బీసీ సెల్ కార్యదర్శి టేకుమూడి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియా నియంత్రణకు పరీక్షలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది బుధవారం సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. జిల్లా వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సాయికిషోర్, ఎస్.లక్ష్మీస్నేహ నేతృత్వంలో ఆరోగ్య, ఆశ సిబ్బంది వలస కార్మికులు నివసిస్తున్న పెదపళ్ల, పినపళ్ల, సంధిపూడి, ఆలమూరు, జొన్నాడ గ్రామాల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి వంశపారంపర్యంగా సంభవించే అవకాశం ఉందని వివరించారు. ఈ వ్యాధి సోకిన వారికి శరీరంలోని ఎర్ర రక్త కణాలు కొడవలి ఆకారంలో మారడం వల్ల రక్తనాళాల్లో రక్త ప్రసరణ తగ్గుతుందన్నారు. దీనివల్ల శరీరంలో భరించలేని నొప్పులు ఎక్కువ అవుతాయని తెలిపారు.

పీఎంశ్రీ పాఠశాలల్లో పనుల వేగం పెంచాలి



రాయవరం ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ సివిల్ వర్క్స్‌ను పరిశీలిస్తున్న సమగ్ర శిక్షా ఏపీసీ మమ్మీ

రాయవరం: పీఎంశ్రీ పాఠశాలల్లో ఫేజ్–1, ఫేజ్–2 కింద మంజూరైన సివిల్ వర్క్స్ వేగం పెంచాలని సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మీ సూచించారు. రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆమె బుధవారం సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న లైబ్రరీ రూమ్, కిచెన్ గార్డెన్ ఫెన్సింగ్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణ పనులు, పాఠశాల ఆటస్థల అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతకు పెద్దపీట వేయాలని హెచ్ఎం వి.శాంతిసునీత, ఎంఈవో–2 వై.సూర్యనారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావుకు సూచించారు. అనంతరం పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర మండల స్థాయి స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేశారు. స్టాక్ పాయింట్‌కు చేరుకున్న పాఠ్య పుస్తకాలను పరిశీలించారు. పాఠ్య పుస్తకాలు సబ్జెక్టుల వారీగా, పాఠశాలల వారీగా విభజించడంపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. మండల స్టాక్ పాయింట్‌కు చేరుకునే నోట్‌బుక్స్, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు తదితర సామగ్రిని జాగ్రత్తగా భద్రపర్చాలని, కిట్లుగా సిద్ధం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఎస్.రామారావు, సీఆర్ఎంటీలు కిలపర్తి పోసిరాములు, వై.లక్ష్మీవీర్రాజు, కె.నీనాసిరి, వాసంశెట్టి సీతామహాలక్ష్మి, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

ఈ–శ్రమ్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి



మండపేటలో ఈ–శ్రమ్ దరఖాస్తు అప్‌లోడ్ చేసే పద్ధతిని పరిశీలిస్తున్న అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్

కపిలేశ్వరపురం: ఉపాధి హామీ పథకం పరిధిలోని కూలీలు, అసంఘటిత రంగ కార్మికులు ఈ–శ్రమ్ పథకంలో గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండపేట సహాయ కార్మికాధికారి కాశి శివనాగమల్లేశ్వరరావు కోరారు. దానికి సంబంధించిన ప్రక్రియ నిర్వహణలో భాగంగా బుధవారం మండపేట ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో సంబంధిత సిబ్బందికి, ఫీల్డ్ అసిస్టెంట్లకి అవగాహన కల్పించారు. ఈ–శ్రమ్ కార్డుల జారీకై చేసుకొనే దరఖాస్తుల అప్‌లోడ్ పద్ధతులను వివరించారు. 50 రోజుల పనిదినాలు కలిగిన భవన నిర్మాణ కార్మికులుగా రూ.110 బ్యాంకు నందు చెల్లించాలని, సంబంధిత రసీదును దరఖాస్తుకు జతచేయడం ద్వారా గుర్తింపు కార్డును పొందవచ్చన్నారు. ఈ–శ్రమ్‌లో నమోదు కావడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే రాయితీలు, ఆర్థిక సహాయం పొందేందుకు అవకాశం కలుగుతుందన్నారు. రూ.2 లక్షలు ప్రమాదబీమా, ఉపాధి హామీ పథకంలో ఉపాధి పొందేందుకు ఈ–శ్రమ్ కార్డు తప్పనిసరి అన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్, ప్రావిడెంట్ ఫండ్ చెల్లించని వారు ఈ–శ్రమ్‌కు అర్హులన్నారు. కుటుంబంలో 16 నుంచి 60 సంవత్సరాల లోపు వారు ఎంత మంది ఉన్నా ఈ పోర్టల్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ–శ్రమ్ కార్డు లేని వారు నూతనంగా పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని, కార్డు ఉన్నవారు పోర్టల్‌లో నవీకరణ చేసుకోవాలని శివనాగ మల్లేశ్వరరావు తెలిపారు.

వేధిస్తున్న ఎండుగడ్డి కొరత

- ట్రాక్టర్ గడ్డి రూ.పది వేలు పైమాటే
- రూ.35 పలుకుతున్న మోపు గడ్డి



గుమ్మిలేరులో కొనుగోలు చేసిన ఎండుగడ్డిని ట్రాక్టర్‌పై తరలిస్తున్న రైతులు

ఆలమూరు: ప్రకృతి వైపరీత్యాలు.. ఆధునిక యాంత్రీకరణ.. మూగ జీవాల జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. దీనివల్ల పాడి పరిశ్రమ అభివృద్ధికి అనేక ఆటంకాలు ఎదురుకావడంతో పశుగ్రాసం కొరత ఏర్పడి రోజు రోజుకూ పశువులను పెంచే వారి సంఖ్య తగ్గిపోతుంది. పాడి పశువుల పోషణకు, అధిక పాల దిగుబడికి మేలైన, మెరుగైన దాణాగా ప్రసిద్ధి గాంచిన ఎండుగడ్డి సామాన్య పాడి రైతులకు అందని ద్రాక్షగా మారింది. వ్యవసాయ విధానం ఆధునీకరణ దిశగా పయనించడంతో పాటు రైతులు తమకు కూలీ ఖర్చులు ఆదా అవుతున్నాయంటూ వరికోత యంత్రాలకు ప్రాధాన్యం ఇవ్వడం ఎండు గడ్డి కొరత సమస్య ఏటా మరింత జటిలంగా మారుతుంది. వరి కోత యంత్రాలను వినియోగితంచి కోతలు కోయడం వల్ల ఆ గడ్డి నిరుపయోగంగా మారుతుంది. గడచిన మూడు దశాబ్దాలుగా ఎన్నడూ లేని విధంగా వేసవిలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు రావడంతో కొంత మంది రైతులు సేకరించుకున్న ఎండుగడ్డి తీవ్రంగా దెబ్బతింది. దీనికి తోడు అధిక సంఖ్యలో రైతులు వరి కోత యంత్రాలను ఆశ్రయించడం వల్ల ప్రతి సీజన్‌లో ఎండు గడ్డి కొరత తీవ్రత నానాటికి అధికమవుతుంది. దీంతో స్థానిక పాడి రైతులు సమీపంలోని చాగల్నాడు, మెట్ట ప్రాంతాల నుంచి ఎకరం గడ్డిని అధిక ధరకు కొనుగోలు చేసి తీసుకువస్తున్నారు. దీనికి మళ్లీ రవాణా, ఎగుమతి, దిగుమతులు, కూలీల ఖర్చుతో కలిపి రూ.ఆరు వేలు ట్రాక్టర్ గడ్డి ఇంటికి తీసుకువచ్చేసరికి రూ.10 వేల వరకూ అవుతుంది.

ఎండు గడ్డికి భలే డిమాండ్

గతంలో ఖరీఫ్‌లో లభించే ఎండుగడ్డిని పాడి రైతులకు పశుగ్రాసంగా ఏడాది పొడవునా వినియోగించేవారు. మారిన పరిస్థితుల కారణంగా ఖరీఫ్ సీజన్‌లోనూ యంత్రాల సాయంతో కోతలు కోయడంతో గడ్డి అంతంత మాత్రంగానే దొరుకుతుంది. దీంతో రబీ సీజన్‌లో కూడా ఎండుగడ్డిని సేకరించి పశువులకు దాణాగా రైతులు వేస్తున్నారు. కూలీలతో కోత కోసేందుకు అవకాశం లేకపోవడంతో యంత్రాలను ఆశ్రయించక తప్పని పరిస్థితి పాడిరైతుల్లో నెలకొంది. కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గంలోని 11 మండలాల్లో సుమారు 58 వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టగా దాదాపు 45 వేల వేల ఎకరాల్లోని పంటను యంత్రాలతోనే కోశారు. అయితే పంట పొలాల్లో కోసిన ఎండుగడ్డిని వృథా పోకుండా మహిళ కూలీలు సేకరణ జరుపుకొంటూ పాడి గ్రాసం కోసం ఆరాట పడుతున్నారు.

గడ్డి సేకరణ యంత్రాలతో మేలు

ఇటీవల కాలంలో అందుబాటులోకి వచ్చిన గడ్డి కోత యంత్రం (స్ట్రాబేలర్)తో కొంత మంది రైతులు గడ్డిని సేకరిస్తున్నారు. ఈ విధంగా సేకరించి గడ్డి మోపు ధర రూ.35 వరకూ పలుకుతుంది. అంత ధర వెచ్చించి ఎండుగడ్డి కొనుగోలు చేసే స్తోమత లేని పేద పాడి రైతులు వరికోత యంత్రాలతో కోసిన పొలాలకు వెళ్లి ఎండుగడ్డిని సేకరిస్తున్నారు. ఆ గడ్డిని పదిలంగా చేసుకుని పశువులకు పెడుతున్నారు. గతంలో అయితే పట్టించుకోని ఆ గడ్డి పరకను నేడు బంగారంలా చూస్తున్నారు. అలాగే పంట పొలాల్లో వదిలేసిన గడ్డిని కొంతమంది కూలీలు సేకరించి పశువుల దాణాకు ఉపయోగించుకుంటున్నారు.

యంత్రాలతో గడ్డిని సేకరించాలి

వరికోత యంత్రాల ద్వారా కోసిన పొలాల్లో వదిలేసిన గడ్డిని యంత్రాల ద్వారా సేకరించే పశుగ్రాసం కొరతను అధిగమించవచ్చు. అలాగే కూలీల ద్వారా పొలాల్లో గడ్డిని ఒక చోట చేర్చి మోపులుగా కట్టి నిల్వ చేసుకోవాలి. ఎండుగడ్డిని దాణాగా ఉపయోగిచడం వల్ల పశువులకు మెరుగైన ఆరోగ్యం పొంది అధిక పాల దిగుబడిని అందిస్తుంది.

– సుభాష్, పశు వైద్యాధికారి, గుమ్మిలేరు.


కుంతీదేవి సంబరానికి సర్వం సిద్ధం

- 16 ఏళ్ల తర్వాత సంబరం
- ముస్తాబైన వెదురుమూడి గ్రామం



విద్యుత్ దీపాలతో మెరుస్తోన్న ఆలయ సమీప వీధి

కపిలేశ్వరపురం: మాల సామాజిక వర్గీయులు అమితంగా ఆరాధించే దేవత కుంతీదేవి. గొంతెమ్మగా వాడుక మాటగా పిలుచుకొనే కుంతీదేవిని దళితవాడల్లో ఆరాధ్యదైవంగా కొలుస్తారు. వారి ఆర్థిక, సామాజిక, స్థానిక పరిస్థితులను బట్టి కుంతీదేవికి సంబరాన్ని చేస్తుంటారు. మండలంలోని వెదురుమూడిలో 2009 ఘనంగా సంబరాన్ని చేశారు. 16 ఏళ్ల తర్వాత మరోసారి దేవి సంబరాల నిర్వహణకు సన్నద్ధమవుతున్నారు. ఈ నెల 16, 17 తేదీల్లో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సంబరాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు దాదాపు పూర్తి చేశారు. సమీప గ్రామాల్లో కుంతీదేవి సంబరాల్లో మాచవరం గ్రామానికి చెందిన యడ్ల ధర్మరాజు దేవీ నేపథ్యాన్ని కథగా చెబుతాడు. ఆయన ప్రకారం జాతర ప్రాశస్త్యమిదీ... పాండవులకంటే ముందు కన్యగానున్న కుంతీదేవికి సూర్యభగవానుడి ఆశీస్సులతో కర్ణుడు జన్మించాడు. కుంతీదేవి కర్ణుడిని పెట్టెలో ఉంచి గంగకు సమర్పిస్తూ నదిలో వదిలేసింది. కాలక్రమంలో కర్ణుడు పెరిగి పెద్దయ్యాడు. తర్వాత కాలంలో కుంతీదేవికి పాండవులు ఐదుగురు జన్మించారు. వారి కంటే ముందు కర్ణుడుకి జన్మనిచ్చిందన్న సంగతి తెలుసుకొన్న భీముడు, తదితర పాండవులు కుంతీదేవిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భయాందోళనకు గురైన కుంతీదేవి హస్తినాపురం వీడి మాల సామాజిక వర్గీయులు నివసించే వాడకు చేరుకొంది. ఆమెను మాల సామాజిక వర్గీయులు ఆశ్రయం ఇచ్చి అక్కున చేర్చుకొన్నారు. అప్పటికే ఆలయ ప్రవేశం అవకాశం లేని మాల సామాజిక వర్గీయులు కుంతీదేవిని ఆరాధ్యదేవతగా కొలుస్తూ ఆలయాన్ని కట్టి పూజించడం ప్రారంభించారు. రంగులతో అలంకరించిన కుండను కుంతీదేవి ప్రతిమగా ప్రతిష్ఠించి పూజలు చేయడం దళిత వాడల్లో ఆనవాయితీగా వస్తూ ఉందని ధర్మరాజు తెలిపారు. వాడుక భాషలో గొంతెమ్మగా పిలుచుకుంటారన్నారు. పనిదినాలు లేని వేసవిలో కుంతీదేవి ఉత్సవాలను నిర్వహిస్తుంటారన్నారు. వెదురుమూడిలోని కుంతీదేవి ఆలయాన్ని రంగులతో ముస్తాబు చేశారు. సమీప వీధులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. 16, 17 తేదీల్లో దేవిని ఉత్సాహంగా ఊరేగించనున్నారు. అందుకోసం 10 గారడీ నృత్య బృందాలను ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.



వెదురుమూడి ఆలయంలో కుంతీదేవి ప్రతిమ